ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 18 మార్చి 2025 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:18 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:48 (బుధవారం ఉదయం)

అటెన్‌షన్!

» పది పరీక్షలు ప్రారంభం
» తొలి రోజు 461 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2025 ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 134 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు, సంస్కృతం పేపర్-1కు 25,723 మంది విద్యార్థులకు 461 మంది గైర్హాజరయ్యారు. లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.విద్యార్థులకు తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని..వేసవి నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దానవాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతున్న తీరును జేసీ చిన్న రాముడు పరిశీలించారు.ఇక చివరి నిమిషంలో విద్యార్థులు ఉరుకులు పరుగులు, హాల్ టికెట్ నెంబరు ప్రకారం రూములు గుర్తించడంలో హడావుడి షరా మామూలుగానే కనిపించాయి. పరీక్షలకు పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు పరీక్ష ముగిసే వరకూ చాలా చోట్ల ఎండలోనే వేచి చూడాల్సి వచ్చింది. రెండు కాళ్లూ పనిచేయని దివ్యాంగురాలైన తన కూతురును ఒక చేతితో ఎత్తుకొని, మరో చేతితో పెన్నుల బాక్సు తీసుకొని చున్నీ లాల్ జాజు పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన తండ్రిని చూసి అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేసినా.. నవ్యశ్రీ తన కాళ్లపై తాను నిలబడాలని ఆశీర్వదిస్తూ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. నవ్యశ్రీ చదువులో మేటి అని సహ విద్యా ర్థులు చెప్పారు.ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో కె.వాసుదేవ రావు పేర్కొన్నారు. 19న ద్వితీయ భాష పరీక్ష నిర్వహించనున్నారు.



రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజు హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు.. పరీక్షకు వెళ్లే ముందు రూమ్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థిని

12 మందికి చార్జిమెమోలు

ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పలు ఆరోపణలు, అవకతవలపై 12 మంది అధికారులకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి శశి భూషన్ కుమార్ సోమవారం చార్జిమెమోలు జారీ చేశారు. గతంలో రాజానగరం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ప్రస్తుతం శ్రీకృష్ణపట్నం కార్యదర్శిగా ఉన్న కెవి.భాస్కరరరావు, కోరుకొండ పంచాయతీ కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, రాజానగరం కార్యదర్శిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన ఎం.అచ్యుత రామారావు, నామవరం కార్యదర్శి పి.రామకృష్ణ, చింతూరు ఏవోగా విధులు నిర్వహించి ఇటీవల రిటైర్డ్ అయిన పి. రఘు రామారావు,ప్రస్తుత రంపచోడవరం పీఆర్‌ఆర్డీ వి. సత్యనారాయణమూర్తి, కోరుకొండ పీఆర్‌ఆర్డీగా రిటైర్డ్ అయిన పీఆర్‌కె భగవాన్, కొండగుంటూరు కార్యదర్శి వీవీఎస్‌ఎన్‌ఎం. గంగాధర్,రాజానగరం పీఆర్‌ఆర్డీగా పనిచేసిన జాన్ మిల్టన్ , గతంలో పీఆర్‌ఆర్డీగా పనిచేసిన పీజీ.రామకృష్ణ, గతంలో ఎంపీడీవో, ప్రతేకాధికారిగా పనిచేసిన బి.రామారావు, రాజానగరం ఎంఈవో పనిచేస్తూ, నామవరం గ్రామ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించి ప్రస్తుత కపిలేశ్వరపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.జోగయ్యశాస్త్రిలకు చార్జిమెమోలు జారీ చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు.

ప్రైవేటుకు.. ఫిట్‌నెస్!





జిల్లాకో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు

» 3 జిల్లాలు 3 కేంద్రాలు
» తూర్పునకు రాజానగరం
» కాకినాడకు వాకలపూడి
» నెలాఖరుకు కోనసీమలో
» ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇక ప్రైవేటు
» ఆర్టీఏ కార్యాలయాలకు దూరం
» ఏ జిల్లా వాహనాలు అక్కడే
» రోజుకు 50 వాహనాల టెస్ట్‌లు
» సర్కారు ఆదాయానికి గండి
» రెండేళ్ల వరకూ ప్రైవేటు జేబు ఫుల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇక వాహనాల ఫిట్‌నెస్‌కు ఆర్‌టీవో అధికారుల చుట్టూ తిరగాల్సిన పనేలేదు.. ఎందుకంటే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేట్‌కు అప్పగించారు. కేంద్ర రవాణా శాఖ ఆదేశాలతో జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను శాంక్షన్ చేసింది. రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి సీటీఆర్‌ఎల్ ఆల్ట్ ఫిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండరు దక్కింది.ఆ సంస్థ ఐదు జిల్లాల్లో శుక్రవారం నుంచి వీటిని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని జిల్లాల్లో ఈ స్టేషన్లు పనిచేయనున్నాయి.ఆయా జిల్లాల్లో ప్రజలకు సంబంధించిన లైట్ మోటారు వెహికిల్స్, హెవీ మోటార్ వెహికిల్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఈ సంస్థ మాత్రమే ఇస్తుంది. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజానగరం, కాకినాడ జిల్లాకు సంబంధించి వాకలపూడిలో ఏర్పాటు చేశారు. ఇక కోనసీమ జిల్లాలో ఈ నెలాఖరుకు ఏర్పాటు చేయనున్నారు.ఇంత వరకూ ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫై చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పనులన్నీ ఇక ఈఏటీఎస్‌లో జరుగుతాయి.

ప్రైవేటీకరణ ఎందుకు?

ఫిట్‌నెస్ సర్టిఫై ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపయోగం ఏంటి? ఎందువల్ల రవాణా శాఖ నుంచి ఈ విధులను తప్పించారనేదానికి సమాధానం లేదు. ఆర్టీఏ అధికారులకు ఏ విధమైన సమాచారం లేదని చెప్పడం గమనార్హం. అవినీతి తగ్గించాలని ప్రైవేటీకరించారా..లేదా ఎక్కువ ఆదాయం కోసం అమలు చేస్తున్నారా, ఫిట్‌నెస్‌లో లోపాలు ఏమైనా బాగుపడతాయని చూస్తున్నారా అనేది తెలియడంలేదు. వాహనాలు ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిజాయితీగా ఈ టెస్టులు నిర్వహిస్తే మేలే. ప్రైవేట్ బస్సులు, కార్లు, క్యాబ్‌లు, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు వంటివన్నీ ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. పసుపు నెంబరు బోర్డులు ఉంటే ట్రాన్స్‌పోర్టు, తెలుసు నెంబరు ప్లేట్లు ఉంటే నాన్- ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్‌టైమ్‌లో మొదటి 8 ఏళ్లలో ప్రతి రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. 8 ఏళ్ల తర్వాత ఏడాదికోసారి టెస్ట్ చేయించాలి. 15 ఏళ్లకు కండిషన్ చూసి ఆపేయాలి. స్కూల్ బస్సులకు కేవలం 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు.గతంలో జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ రాజమహేంద్రవరం,కొవ్వూరు ఆర్టీవో కార్యాలయాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వాహనాలు రాజానగరం కల్వచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)కు రావాల్సిందే.

రెండేళ్ల ఆదాయం జేబుల్లోకే!

సాధారణంగా వాహనాల ఫిట్‌నెస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం వచ్చేది. జిల్లాలో వేలాది వాహనాలు ఉన్నాయి. కేంద్ర ట్రాన్స్‌పోర్టు ఇండియా సలహా మేరకు ఏటీ ఎస్‌లు రెండేళ్ల పాటు వాహనాల నుంచి ఫిట్ నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మంతా సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక పైసా కూడా చెల్లించన వసరం లేదు.ఇది టెండర్ విధానంలో పెట్టిన నిబంధనగా చెబుతున్నారు. ఒక్కో ఏటీఎస్‌కు ఖర్చు రూ.4.5 కోట్లు అవుతుందని నిర్వాహకుల కథనం.ప్రతి స్టేషన్‌లో మిషనరీతో పాటు 21 మంది సిబ్బంది ఉంటారు.ప్రభుత్వం గతంలో వసూలు చేసిన చలానా కంటే సుమారు రూ.200లకు పైగా పెంచినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటీఎస్ చలానా ధరల ప్రకారం లైట్ మోటారు వెహికల్ కేటగిరీకి అంటే ఆటో నుంచి మొదలు మిగతా అన్నింటికి ఫిట్‌నెస్ పరీక్షకు రూ.860 వసూలు చేయాలి.హెవీ మోటారు వెహికిల్స్‌కు రూ.1320 వసూలు చేయాలి.రోజుకు ఒక్కో స్టేషన్‌లో 50 వాహనాలకు టెస్టులు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

అవినీతిని కొనసాగిస్తారా..?

గతంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్‌కు ప్రభుత్వ చలానాతో పాటు అదనంగా వసూలు చేసిన అవినీతి సొమ్మును ఈ కొత్త విధానంలో కూడా వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. రాజానగరంలోని ఏటీఎస్‌లో అక్కడి నిర్వాహకుడు ఒకరు జిల్లాలోనీ ఆర్టీఏ ఏజెంట్లను పిలిచి సుమారు గంట సేపు సమావేశం నిర్వహించడం గమనార్హం. గతంలో ఎలా అయితే వాహనదారుల నుంచి అదనంగా వసూలు చేసి అధికారులకు ఇచ్చేవారో.. అలాగే తమకు కూడా ఇవ్వాలని, అపుడే మీ కమీషన్ మీకు వస్తుందని స్పష్టం చేసినట్టు సమాచారం. త్వరలో రవాణా అధికారులతో కూడా తాము లోపాయికారిగా ఒప్పందం పెట్టుకుంటామని చెప్పినట్టు సమాచారం.దీనిపై ఏజెంట్లు స్పందించి ఒక నెల తమకు గడువు ఇస్తే తర్వాత ఎలా చేయమంటే అలా చేస్తామని కూడా చెప్పినట్టు సమాచారం.ఇదిలా ఉండగా గతంలో రవాణా శాఖ అధికారులు వసూలు చేసిన జాబితా ఒకటి బయటకు రావడం గమనార్హం.



సమస్యలు వింటున్న కలెక్టర్

టేబుల్ వర్క్ చర్యలను ఉపేక్షించను

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : టేబుల్ వర్క్ చర్యలను ఉపేక్షించేదిలేదని కలెక్టర్ పి.ప్రశాంతి మండిపడ్డారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం మధ్యలో అకస్మాత్తుగా కలెక్టర్ అక్కడున్న అధికారులతో సమావేశం అయ్యారు.సమస్యల పరిష్కారంలో ఫీల్డ్‌కు ఎందుకువెళ్లడం లేదని అధికారులను ప్రశ్నించారు. మండలాల్లో ఎక్కువ సమస్యలు వస్తుంటే నేను, జేసీ వెళుతున్నాం మీరేందుకు వెళ్లడంలేదని మండిపడ్డారు. సమస్యల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చి సింపుల్‌గా కూర్చుని పక్కవారితో మాట్లాడుకుని వెళ్లిపోతామనుకుంటే కుదరదన్నారు. మీ అందరు నోట్స్ అఫీషియల్ గ్రూప్ ఫాలో కావాలన్నారు. శాఖల వారీగా టాస్క్‌లు పూర్తి చేయాలన్నారు. అర్జీలపై ప్రజలతో మాట్లాడి వారి సంతృప్తిస్థాయి తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు స్వీకరించారు. ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు కలెక్టరేట్‌కి చేరుకుని అధికారులకు తమ అర్జీలను పెట్టుకున్నారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని పలువురు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలో 20 ఏళ్లగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలకు ఎంపిక చేసిన జాబితాలో అన్యాయం జరుగుతుందన్నారు.జాబితాను పునఃపరిశీలన చేసి అక్రిడేషన్ కలిగిన అర్హు లైన జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు, ఫొటోగ్రాఫర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోతా సారథి, సిహెచ్ శివన్నారాయణ, పెనుగొండ సోమేశ్వరరావు, మోరంపూడి సోమరాజు, మధు,రామకృష్ణ, తిరుమల, బాబి పాల్గొన్నారు.

సమస్యపై వాట్సప్ మెసేజ్.. స్పందించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సమస్య ఉందంటే స్పందించే నాయకులు చాలా అరుదు..గత వైసీపీ ప్రభుత్వంలో అయితే అసలు ఆ క్వశ్చన్ లేదు..నాయకులు ప్రజలను దగ్గరకు కూడా రానిచ్చేవారు కాదు.ప్రస్తుతం అధికారంలో ఉన్నది చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కావ డంతో చిన్న సమస్య అయినా సరే ఏకంగా మంత్రులు స్పందిస్తున్నారు.. సమస్య పరిష్కరిస్తున్నారు. నిడదవోలులో ఆదివారం రాత్రి జరిగిన సంఘటనే అందుకు ఉదాహరణ. నిడద వోలు పెద్దమసీదు వీధి, జగనన్న కాలనీల్లో ఆదివారం రాత్రి కరెంట్ పోయింది. ఎంత సేపటికీ రాలేదు. సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మంత్రి కూడా ఉన్న గ్రూప్‌లో కరెంటు కష్టాలు.. దోమల బాధలు అంటూ కాలనీకి చెందిన ఒక వ్యక్తి వాట్సప్ వేదికగా ఒక పోస్ట్‌పెట్టా డు. రాత్రి 10.50 గంటలకు మంత్రి కందుల దుర్గేష్ అమరావతిలో ఉండి స్వయంగా స్పందించారు. విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి తక్షణం కరెంట్ వచ్చేలా చేశారు. అదే విషయాన్ని మెసేజ్ చేశారు. దాంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయాన్నే దోమల నివారణకు మునిసిపల్ కమి షనర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా కాలనీల్లో సోమవారం పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు.





రాత్రి 10:46 గంటలకు మెసేజ్ పెడితే.. 10:50కి స్పందించి మంత్రి దుర్గేష్ మెసేజ్

అదుపులో డయేరియా కేసులు

» 29 కేసులు.. 20 మంది డిశ్చార్జ్
» 9 మందికి ఆసుపత్రిలో చికిత్స
» 10 వైద్య బృందాల ఏర్పాటు
» 7 రకాల నమూనాల సేకరణ
» భయం వద్దన్న కలెక్టర్, ఎమ్మెల్యే
» డయేరియా కారణాలపై ఆరా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

గోపాలపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం డయేరియా కేసులు అదుపులో ఉన్నాయని.. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి ఆమె సోమవారం పరామర్శించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించేందుకు వైద్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ డయేరియా బాధితులు త్వరగా కోలుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.డయేరియా ప్రభావిత గ్రామాల్లో పర్యటించి పరిస్థితి అంచనా వేశామన్నారు. వాతావరణంలో మార్పులు..ఎండల తీవ్రత తాగునీరు తదితర కారణాల వల్ల ప్రజలు డయేరియాకు గురయ్యారని తెలిపారు.డయేరియా రావడానికి కారణాలు తెలుసుకునేందుకు 10 వైద్య బృందాలు ఏర్పాటు చేశామన్నారు.ఆ బృందం ఏడు రకాల నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. మండల పరిధిలో గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, పెద్దాపురం,వేళ్లచింతలగూడెం, చిట్యాల తదితర గ్రామాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు.అనంతరం కలెక్టర్ చిట్యాల గ్రామంలో డయేరియా ప్రభావిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పెద్దగూడెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. మొత్తం నాలుగు రోజుల్లో 29 కేసులు నమోదు కాగా వారిలో సోమవారానికి 20 మంది డిశ్చార్జ్ అయ్యారన్నారు. మిగిలిన 9 మందికి వైద్యం అందిస్తున్నామన్నారు.ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఆమె తెలిపారు. అనంతరం ఆర్‌డీవో డాక్టర్ రాణిసుస్మిత, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.వెంక టేశ్వరరావు,డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఆర్‌డ బ్ల్యూఎస్‌ఈ గిరి,డీపీవో వి.శాంతమణి, తహ శీల్దార్ అజయ్‌బాబుతో సమీక్షించారు.







ప్రస్తుతం యువత ట్రెండ్ సెట్ చేస్తున్నాం.. అనుకుంటూనే ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. కార్లు, బైక్‌లకు నెంబర్ ప్లేట్లు లేకుండా ఇష్టారీతిన రోడ్లపై తిరుగుతున్నారు. మైనర్లు సైతం అధిక సీసీ ఉన్న బైక్‌లపై రేస్‌లంటూ దూసుకెళుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే జరిగే నష్టం అపారం. ఇలా బైక్‌లపై ఫీట్లు చేస్తున్న వారిని గుర్తించేందుకు వెహికల్ నెంబర్ ప్లేట్లు ఎంతో కీలకం. తీరా ఆ బైక్‌ల నెంబర్లును గుర్తించేందుకు వీలులేకుండా రకరకాల పేర్లతో నెంబరు ప్లేట్లపై రాసేస్తున్నారు. ఫలితంగా ప్రమాదం జరిగిన సమయంలో బాధితులు ఎవరో కూడా తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.

మనల్ని ఎవడ్రా ఆపేది..

ఇష్టారాజ్యంగా వాహనాల నెంబర్ల ప్లేట్లపై రాతలు.. కనిపించని హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

కార్పొరేషన్(కాకినాడ), మార్చి17(ఆంధ్రజ్యోతి): నెంబరు ప్లేట్లు లేకుండా కొందరు ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఇష్టానుసారంగా వాటిని నడుపుతున్నారు. కొంతమంది కార్లు ఉన్నవారిదీ అదే తీరు. రవాణాశాఖాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం, పోలీసులు చూస్తున్నా వెంటనే స్పందించకపోవడంతో వాహనదారుల తీరు మితిమీరుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చాల్సి ఉన్నా కొందరు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నగరంలోని పలు మార్గాల్లో నెంబరు ప్లేట్లులేని, నెంబర్లు లేని, చిన్నగా, గజిబిజిగా రాయించిన, అస్పష్టంగా ఉన్న నెంబర్లతో వాహనదారులు రోడ్డుపై దూసుకుపోతున్నారు. కొందరు వాహనదారులు ఏకంగా సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లు, ఇతరత్రా చిత్రాలతో తిరుగుతున్నారు. ఇంకొంతమంది వాహనదారులు ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం తాలూకా అంటూ నెంబర్ ప్లేట్లు బదులు ఆ ప్లేట్లపై ఈవిధంగా రాసుకుంటున్నారు. వీటితోపాటు మరికొందరు మనల్ని ఎవడ్రా ఆపేదంటూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. 2019 నుంచి షోరూంల్లో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన అమలుల్లోకి వచ్చింది. చాలామంది వీటిని పట్టించుకోవడం లేదు. నెంబరు ప్లేట్లను సంబంధిత వాహన విక్రయదారులే సమకూరుస్తున్నా కొన్ని కొత్త వాహనాలకు ప్లేట్లు నిబంధనల ప్రకారం కనిపించడంలేదు. ఎక్కువగా యువకులు రకరకాల రూపాల్లో నెంబరు ప్లేట్లను అమర్చుతున్నారు. బైక్ రేసుల పేరుతోను, లేదా ఇద్దరు ముగ్గురు కలిసి విపరీతమైన స్పీడ్‌తో దూసుకెళుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులను గుర్తించే క్రమంలో నెంబరు ప్లేట్లు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి



సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ ప్రకారం మోటార్ వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలి. అవసరమైన చోట వాహనం ఎడమ చేతి వైపు ముందు గ్లాసుపై క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ కూడా ఉండాలి. కొంతమంది వాహన యజమానులు ఈహెచ్ఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు తెలిపారు. ఇది సరికాదు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, జిల్లా ఉపరవాణా కమిషనర్, కాకినాడ



ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సూరంపాలెం 'ఆదిత్య'లో ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రోకార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్-2025 సీజన్-5 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ, తమిళనాడునుంచి ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ముందుగా బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ పోటీ ల్లో పాల్గొనే విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించామన్నారు. పూర్తి పారదర్శకంగా పోటీలునిర్వహించేలా అన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లోపాల్గొనడం ద్వారా విద్యార్థులకుటీమ్ స్పిరిట్ లభిస్తుందన్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకోవడం నేర్చుకుంటారన్నారు. మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ భీమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో బ్రేక్ టెస్ట్, ఇంజన్ టెస్ట్, డిజైన్ స్పీడ్ టెస్ట్ తదితర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయనిర్ణేతలు పరీక్షించి విజేతలను నిర్ణయిస్తారన్నారు. విజేతలకు రూ.4లక్షలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆదిత్య వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్ పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

సత్యనికేతన్ సత్రం వ్యవహారంపై ఈవోను కలిసిన డీఎస్పీ, సీఐ

అన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఈవో ఆకస్మిక తనిఖీల్లో ఖాళీ మద్యం సీసాలు దొరికిన సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐసూరిఅప్పారావు ఈవో వీర్ల సుబ్బారావును సోమవారం కలిసి చర్చించారు. దీనిపై ఇప్పటికే ఈవో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇదివరకే ఆయన పర్యటన 18న ఖరారుకావడంతో దీనిపై కూడా మంగళవారం చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సత్యనికేతన్ సత్రంలో పోలీసులకు రెండు గదులు కేటాయించగా వాటిని సోమవారం ఖాళీ చేశారు. సిబ్బందిని సైతం వారం రోజుల్లో సత్రంగదులు ఖాళీచేయాలని ఈవో ఆదేశించారు. ఎప్పటినుంచి పోలీసులు, దేవస్థానం సిబ్బంది గదుల్లో ఉంటున్నారు తదితర వివరాలను అందించాలని సీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. మరోపక్క అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలాల్లో ఆక్రమణలపై, పంపా రిజర్వాయర్‌లో నీటినిల్వలపై కూడా ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ చర్చిస్తారు. కొండపై సమావేశం గురించి ఎటువంటి సమాచారం లేకపోయినా అంతాసిద్ధంగా ఉండాలని సోమవారం సిబ్బందికి సూచించారు.

'కొంగ' జపం!

జపం.. జపం.. జపం.. కొంగ జపం.. అంటే ఇదే అన్నట్టుగా కొంగలన్నీ కలిసి చెట్టుపైకి చేరి ఒక్కో కొమ్మను నివాసంగా చేసుకుని పగలు, రాత్రి కూడా అలానే ఉంటున్నాయి. చెట్టు నిండా కొంగలతో చూడచక్కని ఈ చిత్రం యానాంలో కనిపించింది.

-ఆంధ్రజ్యోతి, యానాం





యానాం నల్లచెరువును ఆనుకొని ఉన్న చెట్లపై సేదతీరుతున్న కొంగలు

నైట్రో సమైన్‌లను నిర్మూలిద్దాం...

క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అంతర్జాతీయ సెమినార్‌లో 'నన్నయ' ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్స్‌లో నైట్రోసమైన్‌లను నిర్మూలిస్తూ క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయ వర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఫార్మాస్యూటికల్స్ విశ్లేషణాత్మక పరీక్షల్లో నైట్రోసమైన్‌ల నియంత్రణ' అంశంపై సోమవారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో చాలా మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. దీనికి జీవనశైలి, ఆహారం, పొగాకు, ఆల్కహాల్‌తో పాటు కలుషితమైన మందుల వాడకం కారణమని గుర్తు చేశారు. నైట్రోసమైన్ వంటి కొన్ని విషపూరిత మలినాలు ఆందోళన కలిగించేవిగా నిరూపితమయ్యాయన్నారు. నైట్రోసమైన్ రహిత మందులను అభివృద్ధి చేయడం ద్వారా నియంత్రించవచ్చన్నారు. మందుల వాడకంలో నియంత్రణ ఉండాలని చెప్పారు. ఫార్మాస్యూటికల్స్, అనలిటికల్ టెస్టింగ్‌లో నైట్రోసమైన్‌ల నియంత్రణ ద్వారా క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. అమెరికాలోని ఫార్మాసూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్‌డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, మలేషియా ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ వి.రవి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అమెరికాలోని కెమ్‌టెక్స్ లేబొరేటరీస్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కటారి ఆన్‌లైన్‌లో ఉపన్యసించారు. నన్నయ, గీతం వర్సిటీలతో పాటు పెర్కిన్ ఎల్మర్ సంస్థల నుంచి 12 మంది పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. సెమినార్‌లో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, నన్నయ వర్సిటీ కెమిస్ట్రీ హెచ్‌వోడీ కె.దీప్తి, అధ్యాపకులు ఎస్.రామకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ, సీహెచ్ వెంకటపద్మారావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన జేఎన్టీయూకే వీసీ



వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధిని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను విజయవాడలోని రాజ్‌భవన్‌లో కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గవర్నర్‌ను కలిసి వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాకినాడ జేఎన్టీయూకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. వర్సిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సాంకేతిక రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టేలా అధ్యాపకులను, రీసెర్చ్‌స్కాలర్స్‌ను, పీజీ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవ వేడుకలను త్వరలో నిర్వహించనున్నామని వీసీ ప్రసాద్ గవర్నర్‌కు వివరించారు. అంతే కాకుండా విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అందరి సమిష్టి కృషితో జేఎన్టీయూకేను అభివృద్ధిపథంలో నడిపిస్తామని గవర్నర్‌కు వివరించారు.



ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులకు వెండి అందజేస్తున్న దాత గోపాలకృష్ణమాచార్యులు

సర్పవరం భావనారాయణస్వామికి..

పది కిలోల వెండి వితరణ

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి కాకినాడకు చెందిన సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు పది కిలోల వెండి సమర్పించారు. దీనిని ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు అర్చకుల సమక్షంలో అందజేశారు. శ్రీమూల భావనారాయణస్వామికి వెండి మకరతోరణం చేయించాలన్న దాత కోరిక మేరకు వెండిని బ్రహ్మానికి ఇచ్చినట్టు ఈవో తెలిపారు. దాతకు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశరావు, పుల్ల వీరబాబు, ఉద్యోగులు కుమార్, చందు పాల్గొన్నారు.



పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు వెండి కిరీటం సమర్పించిన జాస్తి కుటుంబీకులు

పోలేరమ్మకు మూడు కిలోల

వెండి కిరీటం

ఆలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు గ్రామానికి చెందిన జాస్తి సుబ్బన్న-లక్ష్మీనరసమ్మ, సూరన్న-సత్యవతి, శ్రీరాములు-సూరమ్మ దంపతులు వారి వారసులు సుమారు రూ.3.40లక్షలతో మూడు కిలోల వెండితో కిరీటం చేయించారు. సోమవారం దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. జాస్తి భాస్కరరావు, జాస్తి వీర్రాజు, దాసరి శారదాంబ, జాస్తి వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

'నన్నయ' హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ అభివృద్ధికి కాకినాడకు చెందిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తోట సుబ్రహ్మణ్యం రూ.15లక్షలు విరాళం ప్రకటించారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సుబ్రహ్మణ్యం.. తన తండ్రి హరిబాబు జ్ఞాపకార్థం ఈ విరాళం ప్రకటించినట్టు చెప్పారు. విశ్వవిద్యాలయంలో హెల్త్ సెంటర్‌ను విస్తరించి అభివృద్ధి చేయడానికి ఈ నిధులను వినియోగిస్తామన్నారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



దాత సుబ్రహ్మణ్యానికి జ్ఞాపిక అందజేస్తున్న సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ



డెల్టా కాలువలకు

నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సాగునీటిని మరింత పెంచి 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 3,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,000 క్యూసెక్కులు, 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 10,391 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదైంది.

'టెన్'షన్!

పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు

ఆందోళనకు గురైన విద్యార్థులు



పరీక్షా కేంద్రంలో ఎదురుచూస్తున్న విద్యార్థులు



సిమెంటు బస్తాలు తొలగిస్తున్న సిబ్బంది

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు ఉండడంతో కలకలం రేగింది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందే ఆ గదిలో ఉన్న సిమెంటు బస్తాలను హడావుడిగా కార్మికులతో బయటికి మోయించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి బల్లలపై నంబర్లు సైతం వేసి ఉన్న 7వ నంబరు గదిలో కొన్ని బల్లలను పక్కకు పెట్టి సిమెంటు బస్తాలను భారీగా నిల్వ చేసిన తీరు చర్చనీయాంశమైంది. అదే గదిలో 22 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా వారిని బయట నిలుచోబెట్టి బస్తాలను క్లాస్ రూము నుంచి బయటికి హడావుడిగా తరలించారు. అయితే ఈ సమాచారం మీడియాకు చేరడంతో కలకలం రేగింది. అక్కడ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. బస్తాలు తొలగించిన అనంతరం ఏవిధమైన తుడుపు లేకపోవడంతో విద్యార్థులు బెంచీలను శుభ్రం చేసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న డీఈవో సలీంబాషా ఆ పరీక్షా కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులు పరిశీలించి విచారణకు ఆదేశించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పి.అశోక్‌ప్రసాద్‌తో కలిసి డీఈవో ఆ పరీక్షా కేంద్రంలో సిమెంటు బస్తాలు తొలగించకపోవడానికి గల కారణాలు, ఇతర పరిస్థితులపై సహచర ఉపాధ్యాయులను విచారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు సమాచారం. కాగా అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలను ఒక్కసారిగా పరీక్షా సమయానికి ముందే తగలబెట్టడంతో భారీగా పొగ కమ్మేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. పొగ వ్యాపించకుండా నీళ్లతో ఆర్పే ప్రయత్నాలుచేశారు.

'పది'కి ప్రేమతో..!

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రాంభమయ్యాయి. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పరుగులు తీశారు. అయితే కొన్నిచోట్ల దివ్యాంగులు పరీక్షలు రాసేందుకు పయనమవ్వగా వారిని తల్లిదండ్రులు ప్రేమతో, ఎంతో జాగ్రత్తగా పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చి పరీక్ష రాయించారు.



అమలాపురంలో పరీక్షా కేంద్రం వద్ద కుమారుడికి తోడుగా వచ్చి జాగ్రత్తలు చెప్తున్న తల్లి



రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజు హైస్కూల్‌కు దివ్యాంగురాలైన కూతురు నవ్యశ్రీని తీసుకొచ్చి పరీక్ష రాయించిన తండ్రి






తొండంగి: పెరుమాళ్లపురంలో ఎగ్జామ్ సెంటర్‌కు పోలియో కారణంగా కొడుకు కార్తీక్‌ను ఎత్తుకు తీసుకొచ్చిన తల్లి



రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి దివ్యాంగులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు







కాకినాడలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి

మాస్టర్ ప్లాన్ సిద్ధం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయం, మా ఇంట ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామి, మా ఇంట దేవత చెంచులక్ష్మి అని తెలిపారు. వేల ఎకరాల భూములు ఉన్నా శిస్తులు సరిగా రాక ఆదాయమార్గాలు సరి చేయడానికి అధికారులు, అర్చకులతో సోమవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా స్వామివారి ఆలయ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చర్చించారు. ఆలయానికి ఈశాన్య భాగంలో రూ.3.5 కోట్లతో కోనేరు నిర్మాణానికి అంచనా వేశామన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటి రహదారుల పరిశుభ్రతతో పాటు నూతన రహదారుల నిర్మాణం, ఉన్న రోడ్లను మెరుగుపరిచే విధానంలో మార్పులు చేయాలన్నారు. ఇప్పటికే 5,65 దేవాలయాలకు రూ.5వేలు ఇచ్చే విధానానికి ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేలు అందించి ప్రతీ ఆలయంలోని ధూప దీప నైవేద్యాలకు కేటాయించామన్నారు. అదనంగా 150 దేవాలయాలను తీసుకున్నామని తెలిపారు. అలాగే అమలాపురం డివిజన్‌లో 74, రామచంద్రపురం 33, కొత్తపేట 62 మొత్తం 169 ఆలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లు సిద్ధంచేసే విధంగా అధికారులను రిపోర్టు తయారుచేయమని ఆదేశించామన్నారు. అలాగే క్షేత్రపాలకుడు నీలంకంఠేశ్వరస్వామి ఆలయానికి కూడా కృషి చేస్తామని, ప్రస్తుతం రూ.4కోట్ల సీజీఎస్ ఫండ్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ దాతలు 30శాతం అమౌంట్‌తో ముందుకు వచ్చినట్టయితే త్వరలోనే ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు. స్వామివారి ఆలయ భూములపై పురాతన కాలం నుంచి చేస్తున్న రైతులకు శిస్తు పెంచే ఆలోచనపై కలెక్టర్‌తో కమిటీవేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆలయంలో పనిచేసే నాయీబ్రాహ్మణులకు జీతాలు పెంపుపై వారు అడగ్గా రూ.20 నుంచి రూ.25వేల వరకు పెంచడానికి చర్యలు చేపడతామని మంత్రి ఆనం తెలిపారు.

దగ్ధమైన రథం పరిశీలన..

2020 సెప్టెంబరులో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథం అగ్నికి ఆహుతి అవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. రథం శిథిలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. దగ్ధమైన రథం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఐదేళ్లు ఉండడం శ్రేయస్కరం కాదని ఆగమ పండితులు వాపోయరన్నారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఆలయ అధికారులతో రథం ఘటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రథాన్ని జలసమాధి చేయడానికి కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, డీసీ రమేష్‌బాబు, ఏసీ సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు కృష్ణ, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

న్యాయవాదులకు శిక్షణ ప్రారంభంలో పీడీజే గంధం సునీత



శిక్షణ తీసుకునే న్యాయవాదులతో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఎంసీపీసీ ఆధ్వర్యంలో న్యాయవాదులకు 5రోజుల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సుప్రీం, హైకోర్టుల ఆదేశాలతో ఎంసీపీసీ విధానంపై న్యాయాధికారులు, న్యాయవాదులకు అవగాహనతో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. 36 మంది న్యాయవాదులకు 5 రోజుల పాటు 48 గంటలకు తగ్గకుండా తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ శిబిరం 21వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. విశాఖపట్నంలో జిల్లా ప్రధాన, ఇతర న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి 4 విధానాలు ఉన్నాయన్నారు. దీనిలో మధ్యవర్తిత్వానికి సూచించిన కేసులకు శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. కేసుకు సంబంధించిన ఇరుపక్షాలనూ వాళ్ల పిలిపించి ఆమోదయోగ్యంగా ఉండే విధంగా మాట్లాడి ఒకటి, రెండు సిట్టింగుల్లో.. గరిష్ఠంగా 6 నెలల్లో రాజీ మార్గం ద్వారా కేసును పరిష్కరిస్తారన్నారు. దీనికి కూడా లోక్ అదాలత్ మాదిరిగా అప్పీల్‌కి అవకాశం ఉండదన్నారు. కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పుడు నిర్వహిస్తున్న వసతితో కూడిన శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామని పీడీజే తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్‌కే జానీ బాషా, మాస్టర్ ట్రైనర్లు ఆర్.విజయ కమల, ఆర్.రత్నతార తదితరులు పాల్గొన్నారు.

కర్కశ తండ్రి!

- పిల్లలను కాలువతో తోసేసిన నాన్న
- కుమార్తె మృతి, కుమారుడు క్షేమం
- కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు వద్ద ఘటన



కారుణ్య మృతదేహం

ఫైల్‌ఫొటో



వెంటూరులో రోధిస్తున్న తల్లి విజయ, కుమారుడు సందీప్

రాయవరం/ద్రాక్షారామ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల ఓ తండ్రి తన ఇద్దరు కుమారులను హత్య చేసి, తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మరువక ముందే మరో తండ్రి తన ఇద్దరు పిల్లలను కాలువలోకి తోసేశాడు. కుమార్తె మృతిచెందగా కుమారుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కన్న బిడ్డలను కడుపులో పెట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి తన పిల్లలను కాలువలోకి తోసేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గజపతినగరం వద్ద కాలువలో తోసేయగా ఈ సంఘటనలో కుమారుడు కాలువలో తుప్పలను పట్టుకుని నెమ్మదిగా ఒడ్డుకు చేరుకుని క్షేమంగా బయటపడగా, కుమార్తె కాలువలో కొట్టుకుపోయి మృతిచెందింది.

రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య విజయ, పదేళ్ల కుమారుడు రామ్ సందీప్, ఏడేళ్ల కుమార్తె కారుణ్య ఉన్నారు. రామచంద్రపురంలో ఓ ప్రైవేటు పాఠశాలలో సందీప్ నాలుగో తరగతి చదువుతుండగా, కారుణ్య 1వ తరగతి చదువుతోంది. రాజు వెంటూరులో తన ఇంటి వద్ద నుంచి పిల్లలను రామచంద్రపురం పాఠశాలకు రోజు మాదిరిగా మోటార్‌సైకిల్‌పై తీసుకువెళ్లినట్టు సమాచారం. సోమవారం మధ్యాహ్నం పాఠశాల సమయం ముగిసిన తరువాత ఇంటికి పిల్లలను తీసుకు వచ్చే క్రమంలో కాలువలోకి తోసేసినట్టు భావిస్తున్నారు. కుమారుడు సందీప్ తుప్పలను పట్టుకుని నెమ్మదిగా బయటపడి ఏడుస్తూ కేకలు వేయడంతో స్థానికులు చూడడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సందీప్ తీవ్ర భయాందోళనకు గురై ఎటువంటి వివరాలు పూర్తిగా చెప్పలేకపోతున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కారుణ్య మృతదేహం లభించింది. రాజు ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రాజు ఏమైనట్టు?



పిల్లి రాజు

పిల్లలను కాలువలో తోసేసిన తరువాత రాజు కాలువలో దూకేశాడా లేదా అక్కడ నుంచి పరారయ్యాడా అనే సందిగ్ధం గ్రామస్థులు, బంధువుల్లో నెలకొంది. రాజు గ్రామంలో అందరితో కలుపుగోలుగా మంచి గా ఉండేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. వ్యాపార లావాదేవీల్లో కొంత నగదు రావాల్సి ఉండి, ఒత్తిడికి గురై ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నాడా అనే అనుమానం వారి నుంచి వ్యక్తమౌతుంది.

వెంటూరులో విషాదఛాయలు

గ్రామంలో ఎప్పుడూ అందరితో కలుపుగోలుగా ఉండే రాజు తన పిల్లలను కాలువలో తోసేసిన ఘటనలో కుమార్తె కారుణ్య మృతి చెందడంతో వెంటూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య విజయ, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆరేళ్ల చిన్నారి మృతదేహాన్ని చూసి చలించిపోయారు. ఈసంఘటన స్థానికుల్ని తీవ్రంగా కలచివేసింది.

భర్త వేధింపులు తాళలేక.. కుటుంబాన్ని పోషించలేక..

కాకినాడలో వివాహిత ఆత్మహత్య



మరణించిన తలాటం స్వాతి (ఫైల్ ఫొటో)



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి వ్యసనపరుడిగా మారిన భర్త పెట్టే వేధింపులు తాళలేక, కుటుంబ పోషణ భారంగా మారడంతో ఏంచేయాలో పాలుపోలేని స్థితిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళితే కాకినాడ అర్బన్ ఎస్.అచ్చుతాపురం అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న తలాటం సురేష్, స్వాతి (26) భార్యభర్తలు. వారిద్దరూ ఎమినిదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఐదేళ్ల కొడుకు నిషాంత్, 6నెలల పాప శాన్వి సంతానం. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య స్వాతి బీఫార్మసీ చేసి కరణంగారి సెంటర్‌లో గల అపోలో ఫార్మసీలో ఉద్యోగం చేస్తోంది. మద్యానికి వ్యసనపరుడైన భర్త డబ్బుల కోసం వేధించడం, కొట్టడం, దూషించడం వంటి వేధింపులకు పాల్పడుతుండటంతో పలుసార్లు తగాదాలు పడ్డారు. కొన్నాళ్లపాటు ప్రతాప్‌నగర్‌లో అద్దెకు ఉండేవారు. ప్రస్తుతం అత్తగారు ఇంటికి సమీపంలో అద్దెఇంట్లో నివాసం ఉంటున్నారు. సంపాదించిన డబ్బులు మద్యానికి ఖర్చుచేయడం, భార్య సంపాదించిన జీతం సైతం తీసుకుని తాగేయడంతో కుటుంబ పోషణ భారంగా ఉండడంతో ఏం చేయాలో పాలుపోలని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ధారణకు వచ్చింది. ఆదివారం రాత్రి తన భర్త, ఇద్దరు పిల్లలు పడుకున్నాక సుమారు 2 గంటల ప్రాంతంలో బెడ్ రూమ్ పక్కన ఉన్న మరొక రూమ్‌లోకి వచ్చి ఫ్యాను పక్కన ఉన్న ఇనుపహుక్‌కి చీరతో మెడకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజాము 3 గంటల సమయంలో పాప ఏడుస్తోండటంతో నిద్రలేచిన భర్త సురేష్ భార్య కోసం పరిశీలించాడు. పక్క గదిలోకి వెళ్లగా ఫ్యానుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని చూసి బంధువులు, పోలీసులకు సమాచారం అందించాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు మృతదేహాన్ని పరిశీలించి పక్కన ఉన్న సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె సెల్‌ఫోన్‌ని పరిశీలించగా అందులో తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు, భర్త సంపాదించిన డబ్బులు మద్యానికి పోయడం, ఉద్యోగం చేసిన తెచ్చిన జీతం డబ్బులను సైతం తీసేసుకుని రోజూ మద్యం తాగి వేధింపులకు పాల్పడడంతో ఏం చేయాలో పాలు పోక, భవిష్యత్తులో పిల్లను ఎలా పెంచాలి, కుటుంబ పోషణ ఎలా చేయాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో సందేశాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. సంఘటనా స్థలంలో సూసైడ్‌నోట్, సెల్ఫీ వీడియో స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించడం జరిగిందన్నారు. అభంశుభం తెలియని చిన్నారులను ఎవరు సాకుతారంటూ స్వాతి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోధించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గోపాలపురం గ్రామానికి చెందిన కొవ్వూరి నాగిరెడ్డి ఇంటి వద్ద నుంచి గోపాలపురం సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డికి రెండుకాళ్లకు రక్తపు గాయాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురాగా అప్పటికే నాగిరెడ్డి మృతిచెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. అతడి కుమారుడు కొవ్వూరి జశ్వంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

దివాన్‌చెరువు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు చేపట్టేదిశగా అడుగులు వేయాలని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా లాలాచెరువు అటవీ అకాడమీలో వెదురుసాగు విస్తీర్ణం పెంచడంపై ఔత్సాహిక రైతులు, ట్రేడర్స్‌కు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ బాంబో మిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పాత పద్ధతుల్లో బుట్టలు, తట్టలు, నిచ్చెనలు చేసే దగ్గర నుంచి ప్రస్తుతం భవనాల నిర్మాణాలు, బాంబో హోటల్స్, రిసార్ట్స్ వెదురుకర్రలతో ఏర్పాటు చేయవచ్చన్నారు. వెదురును వివిధ ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రైతులు, వ్యాపారులు నైపుణ్యం పెంచుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. వెదురుతో తయారుచేసే ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మహారాష్ట్ర సింధూరు జిల్లాకు చెందిన కాన్‌బేక్ కంపెనీ చెందిన చైర్మన్ సహ వ్యవస్థాపకుడు సంజీవ్ శశికాంత్ కార్వే మాట్లాడుతూ వెదురుతో హోటల్, రిసార్ట్ నిర్మించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రవీంద్రధామ, డీఎఫ్‌వో శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్ కుమార్ తదితరులున్నారు.

స్నేహితుడి ఇంటికొచ్చి...కాల్వలో గల్లంతై!



గెడ్డం కార్తీక్ (ఫైల్‌ఫొటో)

కడియం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితున్ని కలుద్దామని వచ్చాడు... కాసేపు మాట్లాడుకుని గ్రామంలో ఉన్న కాలవ వద్దకు స్నానానికి వెళ్లాడు. అంతలోనే గల్లంతయ్యారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన గెడ్డం కార్తీక్ (20), జేగురుపాడుకు చెందిన చందు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం కార్తీక్ తన స్నేహితుడు చందు ఇంటికి జేగురుపాడు వచ్చాడు. ఇద్దరూ స్నానానికి అని జేగురుపాడులో ఉన్న కాల్వలోకి దిగారు. కానీ అంతలోనే కార్తీక్ గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కార్తీక్ కోసం గాలింపు చర్యలు చేయిస్తున్నారు. సీఐ ఏ.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మరణంపై వివాదం

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మరణంపై వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన పోతుల పాప (50) తీవ్ర శ్వాసకోస సమస్యతో ఈ నెల 12న కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. పాపకు క్షయ, మధుమేహం కూడా ఉన్నాయని వైద్య పరీక్షల్లో గుర్తించారు. 3 రోజులుగా వార్డులో చికిత్స పొందుతున్న పాప ఆరోగ్యం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా విషమించింది. దాంతో వైద్యులు ఆమెను ఐసీయూకి తరలిస్తున్న క్రమంలో పాప మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు భగ్గుమన్నారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పాప ప్రాణాలు కోల్పోయిందని, పాప మృతిపై ఆసుపత్రి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని ఆందోళన చేశారు. అధికారులు, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అప్పనరామునిలంకలో తిరుమాని సుబ్బారావు (59) రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5.30గంటలకు తిరుమాని సుబ్బారావు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య తిరుమాని ముత్యాలమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొనడంతో మరొకరు..

అలాగే సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన బత్తిన ఫైడిరాజు(23) సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో మోటారుసైకిల్‌పై వెళ్తుండగా సినిమాహాలు సెంటర్‌లో కారు ఢీకొనడంతో ఎగిరి పక్కనున్న ప్రహరీ గోడపై పడి అక్కడికక్కడే మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. తండ్రి బత్తిన బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఉపాధి నిమిత్తం సఖినేటిపల్లి మండలానికి వచ్చిన ఫైడిరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆత్మహత్య



బావిశెట్టి వెంకటేశ్వరరావు (ఫైల్)

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పండూరుకు చెందిన లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బావిశెట్టి వెంకటేశ్వరరావు (48) సోమవారం హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో కొన్నేళ్ల పాటూ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఇటీవలే తన పేరిట ఉన్న సుమారు 4 ఎకరాల భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో 2నెలలు ఉంటానని చెప్పి స్వగ్రామం నుంచి వెళ్లిన నెలరోజులకే ఇలా అర్ధాంతరంగా ఆత్మహత్యకు పాల్పడతారని భావించలేదని వాపోయారు. మృతదేహం సోమవారం రాత్రికి స్వగ్రామం పండూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. మృతుడికి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడే అలవాటు ఉందని, ఆ బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోవడం, డబ్బుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అసలు, వడ్డీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్టు తెలిసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. కుమారుడు విజయనగరంలో ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నాడు. బావిశెట్టి వెంకటేశ్వరరావు ఆత్మహత్య వార్త విన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలివిడిగా మాట్లాడే వెంకటేశ్వరరావు ఆత్మ హత్య చేసుకున్నాడన్న విషయం తెలిసిన తర్వాత షాక్‌కి గురయ్యానని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 26 ఫిర్యాదులు



వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కి 26 ఫిర్యాదులందాయి. అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ(పరిపాలన), ఏవీ సుబ్బరాజు (శాంతి భద్రతలు) ఫిర్యాదుదారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్‌స్టేషన్ల బాధ్యులను ఆదేశించారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 32 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, ఇతర అధికారులు ప్రజల నుంచి 32 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బి.నగేష్ ప్రసాద్ అనే వ్యక్తి తన ఇంటి దగ్గర ఏడాకులు చెట్టు నుంచి వాసన వచ్చి వృద్ధాప్యంలో ఉన్న తనకు, తన తల్లికి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెట్టును తొలగించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఎం.లక్ష్మి.. పెన్షన్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు తనకు పెన్షన్ మంజూరు కాలేదని ఫిర్యాదు చేసింది. కె.మాధురి.. తనకు ఇంటి స్థలం ఇప్పించాలని, వి.నిర్మల ఇళ్ల పట్టాల లిస్టులో తన పేరు వుంది కాని పట్టా ఇవ్వలేదని పట్టా ఇపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ధవళేశ్వరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. జూలై 2023లో పీఆర్సీ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంత వరకు ప్రకటించలేదన్నారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, అడిషనల్ క్వాం టమ్ పెన్షన్‌ను పాత పద్ధతిలో ఇవ్వాలని, ఈహెచ్ఎస్ కార్డుపై క్యాస్‌లెస్ వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తి, యర్రమోతు ధర్మరాజు,డి. కామేశ్వరశర్మ, బి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పార్ట్‌టైం కాంటింజెంట్ స్వీపర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం గేటు వద్ద జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి పవన్ మాట్లాడుతూ ఆయాలకు రూ4వేలు జీతం ఇచ్చి ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని విమర్శించారు.

ధాన్యం దొంగ అరెస్టు

14 క్వింటాల ధాన్యం, ఆటో స్వాధీనం

గోకవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి): పొలాల వద్ద నూర్పి బస్తాల్లో ఉంచిన ధాన్యాన్ని చోరీ చేసిన వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా బుల్లి వెంకటేశులు రంపయర్రంపాలెం-గోకవరం గ్రామాల మధ్య కొంత పొలాన్ని కౌలుకు పండించి ధాన్యాన్ని మూటలుగా కట్టి సమీపంలో నిల్వ ఉంచాడు. ధాన్యాన్ని ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి దుండగులు దొంగిలించినట్టు వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామానికి చెందిన సత్తినాటి వీరబాబు దొంగిలించినట్టు గుర్తించారు. వీరబాబు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలై ధాన్యాన్ని దొంగిలిస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు సుమారు 70 క్వింటాల ధాన్యాన్ని చోరీ చేసినట్టు విచారణలో తెలిసింది. నిందితుడు అరెస్ట్ చేసి అతడి నుంచి 14 క్వింటాల ధాన్యాన్ని, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ధాన్యాన్ని వెంకటేశులుకు అప్పగించామని ఎస్ఐ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

గత ప్రభుత్వం శంకుస్థాపనలతో వదిలేసిన

పనులకు మోక్షం

సీతానగరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన పనులకు కూటమి ప్రభుత్వ హయాంతో మోక్షం లభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. సోమవారం మండలంలోని కాటవరంలో బీజేపీ నాయకుడు గూడపాటి జయరామ్ గృహంలో జరిగిన మండల సమావేశంలో సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ రానున్న పుష్కరాలకు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు స్నాన ఘట్టాల ఏర్పాటు, ఏటిగట్టు అభివృద్ధి పనులకు, లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఎంపీ పురందేశ్వరి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, శ్రీవిద్య, మద్దాల కొండలరావు, బాలయోగి పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్శిటీ స్పోర్ట్స్ మీట్‌లో జీఎస్ఎల్ ప్రతిభ

రాజానగరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల 26వ స్పోర్ట్స్ మీట్‌లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని గెలుచుకున్నట్టు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ సిద్ధార్థ మెడకల్ కళాశాలలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో జీఎస్ఎల్ క్రీడాకారులు బాడ్మింటన్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గాను, టెన్నిస్‌లో రన్నర్స్‌గా నిలిచిందన్నారు. అలాగే టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీల్లో తృతీయ స్థానం, మార్చ్ ఫాస్ట్‌లో ప్రథమ స్థానం సాధించినట్టు పీడీ చెప్పారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ గురునాథ్ తదితరులు అభినందించారు.

గాదరాడలో వైభవంగా పోలేరమ్మ జాతర



కలశ యాత్ర చేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి, కుటుంబీకులు

కోరుకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదరాడ గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బత్తుల సతీమణి వెంకటలక్ష్మి, కుమార్తె ప్రత్యూషదేవి, వందనాంబిక గ్రామంలోని మహిళలతో కలిసి కలశయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారికి రెండు తాడిచెట్లను గ్రామస్థులు నరికి మోసుకొచ్చి అమ్మవారి ఆలయం ముందు ఉయ్యాల వేశారు. ఈ జాతర ఉత్సవాలను ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లుచేసింది. ఈ సంవత్సరం ఆలయాన్ని దర్శనం టిక్కెట్లు అమ్మేందుకు 5రోజులకు రూ2.20లక్షలకు ఒక మహిళ దక్కించుకున్నారు. ఉత్సవాల అనంతరం 22న అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపింది.

వెదుళ్లపల్లి సహకార సంఘం అవినీతిపై విచారణ



అవకతవకలపై విచారణ చేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

సీతానగరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వెదుళ్ళపల్లి సహకార సంఘంలో బయటపడిన అవినీతిపై విచారణ కొనసాగుతోంది. సోమవారం సహకార రిజిస్ట్రారు ఎం.కృష్ణమోహన్, విచారణాధికారులు శివకుమార్, సుబ్బారావు విచారణ కొనసాగిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరులో వెదుళ్ళపల్లి సొసైటీలో రూ.50 లక్షల వరకు బయటపడిన అవినీతి బాగోతంలో ఇప్పటి వరకు జరిగిన విచారణలో రూ.64 లక్షల అవినీతి జరిగినట్టు ఎం కృష్ణమోహన్ ఈ సందర్భంగా తెలిపారు. దానిలో ఇప్పటి వరకు రూ.57 లక్షలు రికవరీ చేశామన్నారు. మిగిలిన రూ.7 లక్షలతో పాటు ఇంకా రశీదులు ఇవ్వకుండా తీసుకున్న సొమ్ములు, తప్పుడు రశీదులు ఇచ్చినవి, తేలవలసి ఉందని, దాని గురించి విచారణ జరుగుతోందన్నారు. రికవరీ చేయవలసిన సొమ్ములు జమచేయకపోతే సివిల్, క్రిమినల్ కేసులు పెట్టి వసూలు చేస్తామని కృష్ణమోహన్ పేర్కొన్నారు.

మూగజీవాల అక్రమ రవాణా

రంగంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ రేషన్ బియ్యం తనిఖీలో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఏడీబీ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తుండగా రంగంపేట, వడిశలేరు గ్రామాల మధ్యలో పెద్దాపురం నుంచి రాజానగరం వైపు వెళుతున్న టార్పాలిన్ కట్టి ఉన్న మినీ ట్రక్కును ఆపి తనిఖీ చేస్తుండగా టార్పాలిన్ కింద అవమానవీయంగా కాళ్లు వెనక్కి విరిసి కట్టేసి రవాణా చేస్తున్న రెండు సంవత్సరాల వయస్సు ఉన్న 10 ఆవులను గుర్తించామని పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. పీడీఎస్ బియ్యం ఏమో అనే అనుమానంతో టార్పాలిన్ తొలగించి చూడగా ఇరికించి వంచి తాళ్లతో కట్టి వేయబడిన గోవులను గుర్తించామన్నారు. ఆవులను దివాన్‌చెరువులోని గోశాలలో దింపి మేత పెట్టి వైద్యం చేయించామన్నారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పౌరసరఫరాల డీటీ గొలుగూరి బాపిరాజు తెలిపారు.

మొదటి రోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- కేంద్రాల వద్ద సెక్షన్ 144
- పోలీసు బందోబస్తు ఏర్పాటు
- రాజానగరంలో వీల్‌చైర్ లేక దివ్యాంగ విద్యార్థులకు ఇబ్బందులు
- ఇద్దరికి స్క్రైబ్ నియామకం



రాజానగరం పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

రాజానగరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాజానగరం మండ లంలో తొలిరోజైన సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు మండలంలో 7 పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 1184 మంది విద్యార్థులకు గాను, ఐదుగురు గైర్హాజరైనట్టు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఏవిధమైన ఒత్తిడులకు లోనుకాకుండా ఉండేలా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే తాగునీరు, వైద్యం వంటి వసతులు కల్పించామన్నారు. రాజానగరం హైస్కూ ల్లోని పరీక్షా కేంద్రం లో 250 మంది, నరేంద్రపురం 142 మంది, తోకాడలో 39 మంది, కానవరంలో 147 మంది, దివాన్‌చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్లో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై నట్టు పేర్కొన్నారు. దివాన్‌చెరువు హైస్కూల్ పరీ క్షా కేంద్రంలో 198 మందికి ఒకరు గైర్హాజరు కాగా, సంపత్‌నగరం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 204 మందికి గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవోలు చెప్పారు. ఇదిలా ఉండగా రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో పరీ క్షలు రాయలేని ఇద్దరు విద్యార్థులకు స్క్రైబ్ (రాసే వారిని) ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన వీల్‌చైర్ ఏర్పాటు చేయకపోవడంతో పరీక్షకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. వెంట వచ్చిన తల్లిదం డ్రుల సహాయంతో పరీక్షా కేంద్రంలోని వెళ్లారు.

586 మంది హాజరు

రంగంపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన పదో తరగతి తెలుగు పరీక్షకు 587 మందికి గాను 586 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో పి.మధుసూధనరావు తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. రంగంపేటలో 220 మందికి 220 మంది, వడిశలేరులో 183 మందికి 183 మంది, సింగంపల్లి హైస్కూల్లో 184 మందికి 183 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఎంఈవో పేర్కొన్నారు.

16 మంది విద్యార్థుల గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి తెలుగు పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయినట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బిక్కవోలు కేంద్రంలో 185 మందికి 183 మంది, బలభద్రపురం కేంద్రంలో 152 మందికి 150 మంది, పందలపాక కేంద్రంలో 241 మందికి 236 మంది అలాగే ఇదే కేంద్రంలో ప్రైవేటుగా పరీక్షలు రాసే 9 మందికి ఇద్దరు మాత్రమే హాజరైనట్టు ఎంఈవో పేర్కొన్నారు.

ఇద్దరు విద్యార్థుల గైర్హాజరు

కడియం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి పరీక్షలకు 928 మంది విద్యార్థులు గాను ఇద్దరు హాజరు కాలేదని ఎంఈవో ఎంఎస్. మణికుమార్ తెలిపారు. 9 ఉన్నత పాఠశాలలకు నుంచి 695 మంది, ఆరు ప్రైవేటు పాఠశాలల నుంచి 233 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉందన్నారు.కడియం ఉన్నత పాఠశాలలో 214 మంది, వేమగిరి జడ్పీ హైస్కూల్లో 96 మంది, కడియపులంక ఉన్నత పాఠశాలలో 83 మంది, వీరవరం జడ్పీ హైస్కూల్లో 120 మంది, జేగురుపాడు ఉన్నత పాఠశాలలో 200 మంది, మురమండ జడ్పీ హైస్కూల్లో 215 మందికి 213 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో పేర్కొన్నారు.

పది మంది విద్యార్థుల గైర్హాజరు

గోకవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకవరం, కామరాజుపేట, రంపయర్రంపాలెం, భూపతిపాలెం, వీరలింకపల్లి గురుకుల పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు 748 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 10 మంది గైర్హాజరయినట్టు ఎంఈవో-2 చిమ్మిరాజుదొర తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

ఏడుగురు విద్యార్థుల గైర్హాజరు

సీతానగరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో 4 కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో సీతానగరం హైస్కూల్ కేంద్రంలో ఇద్దరు, సూర్యచంద్ర పబ్లిక్ స్కూల్ కేంద్రంలో ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయినట్టు ఎంఈవో స్వామినాయక్ తెలిపారు. మొత్తం 602 మంది విద్యార్థులకు గాను 595 మంది పరీక్షలకు హాజరయినట్టు పేర్కొన్నారు.

తొమ్మిది మంది గైర్హాజరు

అనపర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 832మంది పదోతరగతి విద్యార్థులకు నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో 329 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి ఉండగా నలుగురు, కుతుకులూరు జడ్పీ పాఠశాలలో 175 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఇద్దరు, అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 224మంది హాజరు కావలసి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎల్ఎన్‌పురం గురుకుల పాఠశాలలో 101మంది విద్యార్థులకు నూరు శాతం హాజరయ్యారు. నాలుగు సెంటర్లలోను పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎల్ఎన్ పురం గురుకుల పాఠశాల విద్యార్థి యాళ్ల నెస్సీ సోమవారం జరిగిన పదో తరగతి పరీక్ష రాశాడు. అతడిని తల్లిదండ్రులు ఆసుపత్రి నుంచి నేరుగా ఎల్ఎన్ పురంలోని కేంద్రానికి తీసుకువచ్చి పరీక్ష రాయించారు.



కడియం ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థులు



అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయుడు

వాసవీ నారీ శక్తి క్లబ్ ప్రారంభోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వైశ్యహాస్టల్‌లో రాజమండ్రి వాసవీ క్లబ్ సభ్యులతో వాసవీ నారీ శక్తి క్లబ్‌ను ప్రారంభించారు. ఈ మేరకు క్లబ్ చైర్మన్ రాయపూడి నాగసాయిలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమన్వయంతో కష్టపడి ఈ క్లబ్ ఏర్పాటు చేసామన్నారు. క్లబ్ ఏర్పాటుకు సహకరించిన వారందరికి రాయపూడి వెంకటేశ్వరావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాన పనితీరు సూచికలతో నివేదికలు

జిల్లాస్థాయి అధికారులతో సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లాలోని 38 ప్రాధాన్యతా శాఖలకు సంబంధించి నిర్ధేశించిన లక్ష్యాలు, ఆయా శాఖల కార్యకలాపాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో నిర్ధేశించిన ప్రధాన పనితీరు సూచికలను అనుసరించి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఆమె జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్ధేశించిన పనుతీరుకు సంబంధించి నిర్ణీత పట్టికలను ఆయా శాఖాధిపతులకు పంపినట్టు చెప్పారు. వీటికి సంబంధించి నివేదికలు సిద్ధం చేసి మంగళవారం సమీక్ష చేసే సమయానికి అందజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత కార్యక్రమాల అమలు తీరు, అందుకు క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన ప్రణాళికల ఆధారంగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో వివిధ శాఖల పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న అంశాలపై కూడా పీపీటీలో నివేదికలు పొందుపరచడం ముఖ్యమన్నారు. సంక్షిప్తంగా, సమగ్రంగా, స్పష్టత కలిగే నివేదికలు రూపకల్పన చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పాలసీ నిర్ణయం తీసుకోవలసిన అంశాలు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల అనుమతులు తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(గెయిల్) రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ఎస్‌డీసీ పి.భాగ్యవతి, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవోలు వీణాదేవి, స్లేవా రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీటు కోసం ఎదురుచూస్తారు

- 200 మందికి ఉపకార వేతనాల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో సీటు కోసం రికమండేషన్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక చందా సత్రంలో సోమవారం 200 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.1500 చొప్పున ఉపకారవేతనాల పంపిణీ జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి చందా సత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏటా రూ.3 నుంచి 4 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తూ చందాసత్రం మంచి సంప్రదాయం కొనసాగిస్తుందన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడానికి దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. నూరుశాతం ఫలితాలు సాధించాలని కోరారు. పరీక్షలు రాసే విద్యార్థులకు రవాణాశాఖ మంత్రి ఉచిత బస్ సదుపాయం కల్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెట్టిజగదీష్, నల్లం శ్రీను, వెంకన్న, లీలావతి, జయరామ్, చందసత్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈట్ స్ట్రీట్‌ను తొలగించాలని వినతి

స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న ఈట్ స్ట్రీట్‌ను తొలగించాలని దళిత గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది, సోమవారం ఐక్యవేదిక నాయకులు కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాసును కలిసి వినతిపత్రం అందించారు. ఈట్ స్ట్రీట్ వల్ల ఎస్సీ ఎస్టీ హాస్టల్ విద్యార్థినుల చదువులకు ఆటకం కలుగుతుందని వివరించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే.. సోషల్ వెల్ఫేర్ డీడీ శోభతో ఫోనులో మాట్లాడి పరిస్థితిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపాలని సూచించారు. కార్యక్రమంలో మర్రిబాబ్జి , చాపల చినరాజు, సీహెచ్ సుబ్బారావు, పట్నాల విజయకుమార్, బొర్రా న్ని, కె.రత్నం, కానేటి ప్రభు పాల్గొన్నారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పో జిల్లాస్థాయి విజేతలు వీరే..

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 జిల్లా స్థాయి సైన్స్ ప్రయోగ పోటీల్లో విజేతలను ప్రకటించారు. వివరాలను జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు వెల్లడించారు. 1వ విభాగం పర్యావరణం, సుస్థిర అభివృద్ధిలో సీతానగరం మండలం రఘుదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.భానుతేజ, కె.సత్యదుర్గ, నాగేంద్రకుమార్ ప్రథమ బహుమతి సాధించారు. ద్వితీయ బహుమతి రాజమహేంద్రవరం గాంధీపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు కలిదిండి లహరి, కె.లతాజ్యోతి పొందారు. 2వ విభాగం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమ బహుమతి రాజమహేంద్రవరం ఆనందనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు వి.అనిరుధ్, ఎం.దివాకర్, పి.మహేష్ సాధించారు. ద్వితీయ బహుమతి రాజమహేంద్రవరం గాంధీపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పి.జ్యోతిలహరి, మండపరెడ్డి రమ్య పొందారు. 3వ విభాగమైన మూఢనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం విభాగంలో రాజమహేంద్రవరం గాంధీపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మాజేటి వాసవ్, మండ జాయ్ ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు.

అసైన్డు భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసైన్డు భూమిని ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ బలభద్రపురం గ్రామానికి చెందిన మంగన్నకు చెందిన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్ చేశారని, ఆయన చనిపోయిన తర్వాత కుమారులు సాగు చేసుకుంటున్నారని, అయితే కొందరు తప్పుడు రికార్డులు సృష్టించి భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకుని అసలైన వారికి న్యాయం చేయాలన్నారు.

ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు

జయప్రదం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్‌లో మార్చి 21, 22, 23 తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్య కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక మావో భవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాన్య మాట్లాడుతూ ఈ సభల్లో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని అన్నారు. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం కార్పొరేట్ దిగ్గజం ఎలాన్‌మస్క్‌కు సేవ చేస్తున్నట్టే మన దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దాసోహం అంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడచినా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఇష్ఫ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

గోరంట్లకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభినందన

రాజమహేంద్రవరం మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అభినందించారు. ఇటీవల 80వ పుట్టినరోజు జరుపుకున్న గోరంట్లకు సోమవారం అసెంబ్లీలో వారు స్వయంగా శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అంతకు ముందు చంద్రబాబు విజన్-2047పై గోరంట్ల చేసిన ప్రసంగాన్ని వారు మెచ్చుకున్నారు.

గోకవరం ఆర్టీసీ డిపో

మేనేజర్‌గా మార్గరేట్

గోకవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గోకవరం ఆర్టీసీ నూతన డిపో మేనేజర్‌గా మార్గ రేట్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె హైదరాబాద్‌లో డిపో మేనేజర్‌గా పని చేస్తూ బదిలీపై గోకవరం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పని చేసిన రామన్నదొర బదిలీపై విశాఖ జిల్లా గిరిజన కార్పొరేషన్‌లో డిపో మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. గోకవరం ఆర్టీసీ డిపో అభివృద్ధికి పని చేస్తానని మార్గ రేట్ పేర్కొన్నారు.

అయోడిన్ పరీక్షలు

బిక్కవోలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎం.దుర్గాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు అయోడిన్ నిర్ధారణ, యూరిన్ పరీక్షలు నిర్వహించారు. 3 నుంచి 6వ తరగతి విద్యార్థులు 90 మందికి ఈ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.శారదాజ్యోతి, తమలంపూడి ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులు, సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం అన్నారు. సోమవారం ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించి డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబరచిన ఇద్దరు గ్యారేజీ సిబ్బందిని డీఎం సత్కరించారు. అలాగే, కుంభమేళాకు అత్యధికంగా బస్సులను బుక్ చేసిన డ్రైవర్ ఏవీ రావు, భక్తులను క్షేమంగా తీసుకెళ్లి తీసుకొచ్చిన డ్రైవర్లను సత్కరించారు.

ఎమ్మెల్సీగా సోముకు ధ్రువీకరణ పత్రం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు సోమవారం ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ అవకాశం కల్పించిన బీజేపీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:18 (మంగళవారం సాయంత్రం) సహర్: 4:48 (బుధవారం ఉదయం)

అటెన్షన్!

» పది పరీక్షలు ప్రారంభం

» తొలి రోజు 461 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2025 ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 134 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు, సంస్కృతం పేపర్-1కు 25,723 మంది విద్యార్థులకు 461 మంది గైర్హాజరయ్యారు. లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.విద్యార్థులకు తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని..వేసవి నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దానవాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతున్న తీరును జేసీ చిన్న రాముడు పరిశీలించారు.ఇక చివరి నిమిషంలో విద్యార్థులు ఉరుకులు పరుగులు, హాల్ టికెట్ నెంబరు ప్రకారం రూములు గుర్తించడంలో హడావుడి షరా మామూలుగానే కనిపించాయి. పరీక్షలకు పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు పరీక్ష ముగిసే వరకూ చాలా చోట్ల ఎండలోనే వేచి చూడాల్సి వచ్చింది. రెండు కాళ్లూ పనిచేయని దివ్యాంగురాలైన తన కూతురును ఒక చేతితో ఎత్తుకొని, మరో చేతితో పెన్నుల బాక్సు తీసుకొని చున్నీ లాల్ జాజు పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన తండ్రిని చూసి అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేసినా.. నవ్యశ్రీ తన కాళ్లపై తాను నిలబడాలని ఆశీర్వదిస్తూ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. నవ్యశ్రీ చదువులో మేటి అని సహ విద్యా ర్థులు చెప్పారు.ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో కె.వాసుదేవ రావు పేర్కొన్నారు. 19న ద్వితీయ భాష పరీక్ష నిర్వహించనున్నారు.



రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజు హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు.
కొవ్వూరులో పరీక్షా కేంద్రం తనిఖీ చేస్తున్న ఆర్‌డీవో రాణి సుస్మిత

12 మందికి చార్జిమెమోలు

ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పలు ఆరోపణలు, అవకతవలపై 12 మంది అధికారులకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి శశి భూషన్ కుమార్ సోమవారం చార్జిమెమోలు జారీ చేశారు. గతంలో రాజానగరం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ప్రస్తుతం శ్రీకృష్ణపట్నం కార్యదర్శిగా ఉన్న కెవి.భాస్కరరావు, కోరుకొండ పంచాయతీ కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, రాజానగరం కార్యదర్శిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన ఎం.అచ్యుత రామారావు, నామవరం కార్యదర్శి పి.రామకృష్ణ, చింతూరు ఏవోగా విధులు నిర్వహించి ఇటీవల రిటైర్డ్ అయిన పి. రఘురామారావు,ప్రస్తుత రంపచోడవరం పీఆర్‌ఆర్డీ వి. సత్యానారాయణమూర్తి, కోరుకొండ పీఆర్‌ఆర్డీగా రిటైర్డ్ అయిన పీఆర్‌కె భగవాన్, కొండగుంటూరు కార్యదర్శి వీవీఎస్‌ఎన్‌ఎం. గంగాధర్,రాజానగరం పీఆర్‌ఆర్డీగా పనిచేసిన జాన్ మిల్టన్ , గతంలో పీఆర్‌ఆర్డీగా పనిచేసిన పీజీ.రామకృష్ణ, గతంలో ఎంపీడీవో, ప్రతేకాధికారిగా పనిచేసిన బి.రామారావు, రాజానగరం ఎంఈవో పనిచేస్తూ, నామవరం గ్రామ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించి ప్రస్తుత కపిలేశ్వరపురం జడ్పీ హెస్కూల్ హెచ్‌ఎం బి.జోగయ్యశాస్త్రిలకు చార్జిమెమోలు జారీ చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు.

ప్రైవేటుకు.. ఫిట్‌నెస్!





జిల్లాకో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు

» 3 జిల్లాలు 3 కేంద్రాలు

» తూర్పునకు రాజానగరం

» కాకినాడకు వాకలపూడి

» నెలాఖరుకు కోనసీమలో

» ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇక ప్రైవేటు

» ఆర్టీఏ కార్యాలయాలకు దూరం

» ఏ జిల్లా వాహనాలు అక్కడే

» రోజుకు 50 వాహనాల టెస్ట్‌లు

» సర్కారు ఆదాయానికి గండి

» రెండేళ్ల వరకూ ప్రైవేటు జేబు ఫుల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇక వాహనాల ఫిట్‌నెస్‌కు ఆర్‌టీవో అధికారుల చుట్టూ తిరగాల్సిన పనేలేదు.. ఎందుకంటే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేట్‌కు అప్పగించారు. కేంద్ర రవాణా శాఖ ఆదేశాలతో జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను శాంక్షన్ చేసింది. రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి సీటీఆర్‌ఎల్ ఆల్ట్ ఫిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండరు దక్కింది.ఆ సంస్థ ఐదు జిల్లాల్లో శుక్రవారం నుంచి వీటిని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని జిల్లాల్లో ఈ స్టేషన్లు పనిచేయనున్నాయి.ఆయా జిల్లాల్లో ప్రజలకు సంబంధించిన లైట్ మోటారు వెహికిల్స్ హెవీ మోటార్ వెహికిల్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఈ సంస్థ మాత్రమే ఇస్తుంది. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజానగరం, కాకినాడ జిల్లాకు సంబంధించి వాకలపూడిలో ఏర్పాటు చేశారు. ఇక కోనసీమ జిల్లాలో ఈ నెలాఖరుకు ఏర్పాటు చేయనున్నారు.ఇంత వరకూ ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫై చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పనులన్నీ ఇక ఈఏటీఎస్‌లో జరుగుతాయి.

ప్రైవేటీకరణ ఎందుకు?

ఫిట్‌నెస్ సర్టిఫై ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపయోగం ఏంటి? ఎందువల్ల రవాణా శాఖ నుంచి ఈ విధులను తప్పించారనేదానికి సమాధానం లేదు. ఆర్టీఏ అధికారులకు ఏ విధమైన సమాచారం లేదని చెప్పడం గమనార్హం. అవినీతి తగ్గించాలని ప్రైవేటీకరించారా..లేదా ఎక్కువ ఆదాయం కోసం అమలు చేస్తున్నారా, ఫిట్‌నెస్‌లో లోపాలు ఏమైనా బాగుపడతాయని చూస్తున్నారా అనేది తెలియడంలేదు. వాహనాలు ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిజాయితీగా ఈ టెస్టులు నిర్వహిస్తే మేలే. ప్రైవేట్ బస్సులు, కార్లు, క్యాబ్‌లు, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు వంటివన్నీ ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. పసుపు నెంబరు బోర్డులు ఉంటే ట్రాన్స్‌పోర్టు, తెలుసు నెంబరు ప్లేట్లు ఉంటే నాన్- ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్‌టైమ్‌లో మొదటి 8 ఏళ్లలో ప్రతి రెండేళ్లకో సారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. 8 ఏళ్ల తర్వాత ఏడాదికోసారి టెస్ట్ చేయించాలి. 15 ఏళ్లకు కండిషన్ చూసి ఆపేయాలి. స్కూల్ బస్సులకు కేవలం 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు.గతంలో జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ రాజమహేంద్రవరం,కొవ్వూరు ఆర్టీవో కార్యాలయాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వాహనాలు రాజానగరం కల్వచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)కు రావాల్సిందే.

రెండేళ్ల ఆదాయం జేబుల్లోకే!

సాధారణంగా వాహనాల ఫిట్‌నెస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం వచ్చేది. జిల్లాలో వేలాది వాహనాలు ఉన్నాయి. కేంద్ర ట్రాన్స్‌పోర్టు ఇండియా సలహా మేరకు ఏటీ ఎస్‌లు రెండేళ్ల పాటు వాహనాల నుంచి ఫిట్ నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మంతా సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక పైసా కూడా చెల్లించన వసరం లేదు.ఇది టెండర్ విధానంలో పెట్టిన నిబంధనగా చెబుతున్నారు. ఒక్కో ఏటీఎస్‌కు ఖర్చు రూ.4.5 కోట్లు అవుతుందని నిర్వాహకుల కథనం.ప్రతి స్టేషన్‌లో మిషనరీతో పాటు 21 మంది సిబ్బంది ఉంటారు.ప్రభుత్వం గతంలో వసూలు చేసిన చలానా కంటే సుమారు రూ.200లకు పైగా పెంచినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటీఎస్ చలానా ధరల ప్రకారం లైట్ మోటారు వెహికల్ కేటగిరీకి అంటే ఆటో నుంచి మొదలు మిగతా అన్నింటికి ఫిట్‌నెస్ పరీక్షకు రూ.860 వసూలు చేయాలి.హెవీ మోటారు వెహికిల్స్‌కు రూ.1320 వసూలు చేయాలి.రోజుకు ఒక్కో స్టేషన్‌లో 50 వాహనాలకు టెస్టులు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

అవినీతిని కొనసాగిస్తారా..

గతంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్‌కు ప్రభుత్వ చలానాతో పాటు అదనంగా వసూలు చేసిన అవినీతి సొమ్మును ఈ కొత్త విధానంలో కూడా వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. రాజానగరంలోని ఏటీఎస్‌లో అక్కడి నిర్వాహకుడు ఒకరు జిల్లాలోని ఆర్టీఏ ఏజెంట్లను పిలిచి సుమారు గంట సేపు సమావేశం నిర్వహించడం గమనార్హం. గతంలో ఎలా అయితే వాహనదారుల నుంచి అదనంగా వసూలు చేసి అధికారులకు ఇచ్చేవారో.. అలాగే తమకు కూడా ఇవ్వాలని, అపుడే మీ కమీషన్ మీకు వస్తుందని స్పష్టం చేసినట్టు సమాచారం. త్వరలో రవాణా అధికారులతో కూడా తాము లోపాయికారిగా ఒప్పందం పెట్టుకుంటామని చెప్పినట్టు సమాచారం.దీనిపై ఏజెంట్లు స్పందించి ఒక నెల తమకు గడువు ఇస్తే తర్వాత ఎలా చేయమంటే అలా చేస్తామని కూడా చెప్పినట్టు సమాచారం.ఇదిలా ఉండగా గతంలో రవాణా శాఖ అధికారులు వసూలు చేసిన జాబితా ఒకటి బయటకు రావడం గమనార్హం.



సమస్యలు వింటున్న కలెక్టర్

టేబుల్ వర్క్ చర్యలను ఉపేక్షించను

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : టేబుల్ వర్క్ చర్యలను ఉపేక్షించేదిలేదని కలెక్టర్ పి.ప్రశాంతి మండిపడ్డారు. కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో సోమవారం మధ్యలో అకస్మాత్తుగా కలెక్టర్ అక్కడున్న అధికారులతో సమావేశం అయ్యారు.సమస్యల పరిష్కారంలో ఫీల్డ్‌కు ఎందుకువెళ్లడం లేదని అధికారులను ప్రశ్నించారు. మండలాల్లో ఎక్కువ సమస్యలు వస్తుంటే నేను, జేసీ వెళుతున్నాం మీరేందుకు వెళ్లడంలేదని మండిపడ్డారు. సమస్యల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చి సింపుల్‌గా కూర్చుని పక్కవారితో మాట్లాడుకుని వెళ్లిపోతామనుకుంటే కుదరదన్నారు. మీ అందరు నోట్స్ అఫీషియల్ గ్రూప్ ఫాలో కావాలన్నారు. శాఖల వారీగా టాస్క్‌లు పూర్తి చేయాలన్నారు. అర్జీలపై ప్రజలతో మాట్లాడి వారి సంతృప్తిస్థాయి తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం పీజీఆర్‌ఎస్‌లో 181 అర్జీలు స్వీకరించారు. ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు కలెక్టరేట్‌కి చేరుకుని అధికారులకు తమ అర్జీలను పెట్టుకున్నారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని పలువురు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలో 20 ఏళ్లగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలకు ఎంపిక చేసిన జాబితాలో అన్యాయం జరుగుతుందన్నారు.జాబితాను పునఃపరిశీలన చేసి అక్రిడేషన్ కలిగిన అర్హు లైన జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు, ఫొటోగ్రాఫర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోతా సారథి, సిహెచ్ శివన్నారాయణ, పెనుగొండ సోమేశ్వరరావు, మోరంపూడి సోమరాజు, మధు,రామకృష్ణ, తిరుమల, బాబి పాల్గొన్నారు.

సమస్యపై వాట్సప్ మెసేజ్.. స్పందించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సమస్య ఉందంటే స్పందించే నాయకులు చాలా అరుదు..గత వైసీపీ ప్రభుత్వంలో అయితే అసలు ఆ క్వశ్చన్ లేదు..నాయకులు ప్రజలను దగ్గరకు కూడా రానిచ్చేవారు కాదు.ప్రస్తుతం అధికారంలో ఉన్నది చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కావ డంతో చిన్న సమస్య అయినా సరే ఏకంగా మంత్రులు స్పందిస్తున్నారు.. సమస్య పరిష్కరిస్తున్నారు. నిడదవోలులో ఆదివారం రాత్రి జరిగిన సంఘటనే అందుకు ఉదాహరణ. నిడద వోలు పెద్దమసీదు వీధి, జగనన్న కాలనీల్లో ఆదివారం రాత్రి కరెంట్ పోయింది. ఎంత సేపటికీ రాలేదు. సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మంత్రి కూడా ఉన్న గ్రూప్‌లో కరెంటు కష్టాలు.. దోమల బాధలు అంటూ కాలనీకి చెందిన ఒక వ్యక్తి వాట్సప్ వేదికగా ఒక పోస్ట్ పెట్టా డు. రాత్రి 10.50 గంటలకు మంత్రి కందుల దుర్గేష్ అమరావతిలో ఉండి స్వయంగా స్పందించారు. విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి తక్షణం కరెంట్ వచ్చేలా చేశారు. అదే విషయాన్ని మెసేజ్ చేశారు. దాంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయాన్నే దోమల నివారణకు మునిసిపల్ కమి షనర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా కాలనీల్లో సోమవారం పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు.





రాత్రి 10:46 గంటలకు మెసేజ్ పెడితే..
10:50కి స్పందించి మంత్రి దుర్గేష్ మెసేజ్

అదుపులో డయేరియా కేసులు

» 29 కేసులు.. 20 మంది డిశ్చార్జ్

» 9 మందికి ఆసుపత్రిలో చికిత్స

» 10 వైద్య బృందాల ఏర్పాటు

» 7 రకాల నమూనాల సేకరణ

» భయం వద్దన్న కలెక్టర్, ఎమ్మెల్యే

» డయేరియా కారణాలపై ఆరా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

గోపాలపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం డయేరియా కేసులు అదుపులో ఉన్నాయని.. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి ఆమె సోమవారం పరామర్శించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించేందుకు వైద్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ డయేరియా బాధితులు త్వరగా కోలుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.డయేరియా ప్రభావిత గ్రామాల్లో పర్యటించి పరిస్థితి అంచనా వేశామన్నారు. వాతావరణంలో మార్పులు..ఎండల తీవ్రత తాగునీరు తదితర కారణాల వల్ల ప్రజలు డయేరియాకు గురయ్యారని తెలిపారు.డయేరియా రావడానికి కారణాలు తెలుసుకునేందుకు 10 వైద్య బృందాలు ఏర్పాటు చేశామన్నారు.ఆ బృందం ఏడు రకాల నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. మండల పరిధిలో గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, పెద్దాపురం,వేళ్లచింతలగూడెం, చిట్యాల తదితర గ్రామాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు.అనంతరం కలెక్టర్ చిట్యాల గ్రామంలో డయేరియా ప్రభావిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పెద్దగూడెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. మొత్తం నాలుగు రోజుల్లో 29 కేసులు నమోదు కాగా వారిలో సోమవారానికి 20 మంది డిశ్చార్జ్ అయ్యారన్నారు. మిగిలిన 9 మందికి వైద్యం అందిస్తున్నామన్నారు.ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఆమె తెలిపారు. అనంతరం ఆర్‌డీవో డాక్టర్ రాణిసుస్మిత, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.వెంక టేశ్వరరావు,డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ గిరి,డీపీవో వి.శాంతమణి, తహ శీల్దార్ అజయ్‌బాబుతో సమీక్షించారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రైతులకు సబ్సిడీపై పరికరాలు అందించాలి

● శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే ముప్పిడి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలు, యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీపై అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అసెంబ్లీలో రైతు సమస్యలపై చర్చించారు. మెట్టప్రాంతమైన కొవ్వూరు నియోజకవర్గంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రైతుల వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోర్లు అందించారని గుర్తు చేశారు. అనంతరం 2014 నుంచి 19 వరకు చంద్రబాబు హయాంలో కూడా ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించి రైతులను ఆదుకున్నారన్నారు. భూమికి సంబంధించి సాయిల్ టెస్టులు జరిపి ఏ పంట వేసుకోవచ్చు అనే విషయాన్ని తెలియజేశారన్నారు. మెట్ట ప్రాంతంలో పొగాకు, కోకో, కొబ్బరి పండించుకోవడానికి 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను కూడా అందించారన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి అవసరమైన ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్లు, రోటోవేటర్లు వంటివి ఎక్కువ సబ్సిడీపై అందించాలన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి : ఆర్డీవో


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. దీనిలో భాగంగా తొమ్మిది ఫిర్యాదులు స్వీకరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి కార్యక్రమం జరిగింది. వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మూడు ఫిర్యాదులు వచ్చినట్టు కమిషనర్ టీ. నాగేంద్ర కుమార్ తెలిపారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించినట్టు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తెలిపారు.

అయోడైజ్డ్ ఉప్పుతో వ్యాధుల నివారణ


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి17(ఆంధ్రజ్యోతి): అయోడైజ్డ్ ఉప్పు వాడకం వల్ల పిల్లల్లో వచ్చే గాయిటర్, బుద్ధిమాంద్యం, ఎదుగుదల లోపం వంటి సమస్యలను నివారించవచ్చని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. ధర్మరాజు తెలిపారు. దొమ్మేరు ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్-1, జడ్పీ హైస్కూల్‌లో అయోడిన్ ఉప్పు లోపం వల్ల వచ్చే వ్యాధులు, నివారణలో భాగంగా (ఎన్ఐడీడీసీపీ) నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మరాజు మాట్లాడుతూ 6 నుంచి 12 సంవత్సరాల లోపు బాలికలు 45, బాలురు 45 మందికి ప్రత్యేక విధానం ద్వారా గాయిటర్ పరీక్షలు చేయించామన్నారు. ఇందులో 18 మంది నుంచి ఇంటిలో వాడే ఉప్పు శాంపిల్స్, 9 మందికి యూరిన్ శాంపిల్స్ తీసుకుని అయొడైజడ్ ఉప్పు శాతం ఎంత మేరకు ఉందో తెలుసుకోవడానికి ఆ నమూనాలను జిల్లా కేంద్రానికి పంపించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కండక్టర్ ప్రసాద్‌కి మరో ఉన్నత పురస్కారం

గోపాలపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : విశాలక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన మినీ కథల పోటీల్లో కండక్టర్ ప్రసాదరావు రాసిన మానవమృగం కథ బహుమతికి ఎంపికైంది. నెల్లూరు టౌన్‌హాలులో ఆదివారం జరిగిన సన్మానసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు మండలి బుద్దాప్రసాద్ చేతుల మీదుగా ప్రసాదరావుకు ఘన సత్కారం చేశారు. అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షతన సన్మానసభ జరిగింది.

కల్పనాచావ్లా జయంతి

తాళ్లపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మనదేశం తొలి అంతరిక్ష యాత్రికురాలు కల్పనా చావ్లా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దున్న దుర్గారావు కల్పనాచావ్లా గురించి విద్యార్థులకు వివరించారు. పేరెంట్ కమిటీ సభ్యులు సునీత, ఆయా కుమారి, తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు ఏఎన్‌జడ్పీ హైస్కూల్లో తనిఖీ చేస్తున్న ఆర్డీవో


సమిశ్రగూడెంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


చాగల్లు హైస్కూల్లో తనిఖీ చేస్తున్న తహశీల్దార్ మెరికమ్మ

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

- పలుచోట్ల విద్యార్థుల గైర్హాజరు
- కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8-45 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణం, మండలంలోని 10 సెంటర్లలో మొత్తం 1272 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1250 మంది హాజరవ్వగా, 22 మంది గైర్హాజరయ్యారు. అలాగే జడ్పీహెచ్ఎస్, పంగిడిలో 108కి 106, జడ్పీహెచ్ఎస్, కుమారదేవంలో 118కి 118, జడ్పీహెచ్ఎస్, వాడపల్లిలో 211కి 211, కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 134కి 132, మున్సిపల్ హైస్కూల్‌లో 75కి 69, ఏఎన్‌జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో 109కి 109, డా.సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూ ల్లో 95కి 93, వేములూరు దీప్తి హైస్కూల్లో 148 మందికి 143, అభ్యాస పాఠశాలలో 130కి 130, భాష్యం పాఠశాలలో 144కి 139 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కొవ్వూరు ఆర్డీవో డా. రాణీసుస్మిత, గవర్నమెంట్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌ను కొవ్వూరు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణం, మండలంలో సోమవారం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు 1448 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 1413 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి గణేష్ తెలిపారు.

చాగల్లు: మండలంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 374 మంది విద్యార్థులకు గాను 369 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. స్థానిక హైస్కూల్లో 204 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. పాతసిలబస్‌కు సంబంధించి నలుగురు విద్యార్థులకు గాను ముగ్గురు హాజరయ్యారు. ఊనగట్ల హైస్కూల్లో 101 మందికి గాను 99 మంది, మార్కొండపాడు హైస్కూల్‌లో 73 మందికి గాను పూర్తిస్థాయిలో హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఫ్లయింగ్ స్క్వాడ్ కే. సత్యనారాయణ తనిఖీ చేశారు. తాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంఈవో యు.గురునాథం తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వేలివెన్నులో మూడు, ఉండ్రాజవరం హైస్కూల్‌లో రెండు కేంద్రాల్లో 821 మంది విద్యార్థులకు గాను 817 మంది పరీక్షలకు హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. వీరితోపాటు సప్లిమెంటరీ పరీక్షలు రాసే 11 మంది విద్యార్థుల్లో ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. వేలివెన్ను పరీక్షా కేంద్రంలో సీతానగరం ఎమ్ఈవో నాయక్ స్క్వాడ్ ఆఫీసరుగా పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంఈవో శారదాజ్యోత్స్న పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్సై జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

దేవరపల్లి: మండలంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఐదు సెంటర్లను కేటాయించారు. దేవరపల్లి జడ్పీహైస్కూల్, శ్రీచైతన్య, భాష్యం స్కూల్, యర్నగూడెం జడ్పీ హైస్కూల్, చిన్నాయిగూడెం జడ్పీహైస్కూల్స్‌లో 1035 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1004 మంది హాజరైనట్టు ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈవోలు తిరుమలదాసు, కేఆర్ ఎస్‌వీవీ అప్పారావు తనిఖీ చేశారు. అలాగే శ్రీచైతన్య, జడ్పీహైస్కూల్, భాష్యం స్కూల్‌లో పరీక్షలు జరిగాయి. దీనిలో భాగంగా 600 మంది విద్యార్థులకు పెన్నులు, పంపిణీ చేసినట్టు టీడీపీ నేత ఉప్పులూరి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యలమాటి అక్కిరాజు, బిక్కిన నాగరాజు, పసుపులేటి శివనాగప్రసాద్, కంబాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 30 నిమిషాల ముందే చేరుకున్నారు. వీరిని తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. మొదటిరోజు పరీక్షకు 678 మందికి గాను 665 మంది హాజరైనట్టు రూట్ ఆఫీసర్ ఎంఈవో స్నేహరాజీ తెలిపారు.


ఉండ్రాజవరంలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు


దేవరపల్లిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో


తాళ్లపూడిలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు


కొవ్వూరు గవర్నమెంట్ హైస్కూల్ వద్ద విద్యార్థులు

అక్రమ మట్టి తవ్వకాల నివారణకు ప్రత్యేక బృందాలు

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి లంకలలో అక్రమ మట్టి తవ్వకాలను నివారించేందుకు రెవెన్యూ సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను నియమించినట్టు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తెలిపారు. చిడిపి, కుమారదేవం గ్రామాలకు సంబంధించి గోదావరి లంకలలో అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతున్నట్టు వస్తున్న సమాచారం మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కుమారదేవం, చిడిపిలో తవ్వకాలు జరగకుండా చూసేందుకు గోదావరి ఏటిగట్టు, రేవు ఎక్కే ప్రాంతాలలో నిఘా ఉంచి, అట్టి వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని సిబ్బందిని ఆదేశించామని తహశీల్దార్ చెప్పారు. ఒకటో బృందానికి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎండీ హుస్సేన్, సీహెచ్ జగ్జీవన్‌రావు, కె.సూర్యచంద్రం, రెండో బృందానికి సీనియర్‌సహాయకులు జీ. సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు టి.సుబ్రహ్మణ్యం, కె.పృథ్వీరాజ్, ఇమ్మానియేల్‌తో ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ అక్రమ మట్టి తవ్వకాలు జరిగినట్టయితే టీం లీడర్లు బీ. విశ్వేశ్వరరావు 7981029003, జీ. సుబ్బారావు 9491051510 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

బల్లిపాడు ర్యాంపులో ఉచిత ఇసుక పాలసీకి తిలోదకాలు


తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వేగేశ్వరపురం గ్రామస్థులు

తాళ్లపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంత ఇంటి నిర్మాణాలకు పంచాయతీలో తీసుకున్న పర్మిషన్లతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లకు ఇసుకను ఉచితంగా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అందని పరిస్థితి మండలంలోని బల్లిపాడు ర్యాంపులో నెలకొంది. రీచ్‌లో ట్రాక్టర్లకు వివిధ రకాలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని వేగేశ్వరపురంలోని యజమానులు, ట్రాక్టర్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఇదేమి అని ప్రశ్నిస్తే ర్యాంపులోకి ట్రాక్టర్ రానీయమని బెదిరిస్తున్నారని వారు తెలిపారు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకోవాల్సి ఉంది. ఈ విషయంపై సోమవారం తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సూలా పోసియ్య, హరిప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీసీ ప్రసన్నశ్రీని కలిసిన సువర్ణరాజు


వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సువర్ణరాజు

దేవరపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య ఎస్.ప్రసన్నను సోమవారం దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సువర్ణరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ తమ కళాశాలను సందర్శించాలని కోరారు. అనంతరం వీసీ మాట్లాడుతూ కళాశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉత్తమ విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రక్కిలంక పంచాయతీ'లో అక్రమ నిర్మాణాలు


పైడిమెట్టలో అక్రమంగా నిర్మిస్తున్న ఆర్చి

తాళ్లపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక పంచాయతీ పరిధిలో అక్రమ కట్టడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. పైడిమెట్ట ఎస్సీ పేటలోని కమ్యూనిటీ భవనానికి చెందిన స్థలాన్ని ఆనుకుని ఉన్న భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలు చేపడుతున్నట్టు, ఆ స్థలంలోకి ప్రవేశం చడానికి కమ్యూనిటీకి చెందిన స్థలంలో పెద్ద ఆర్చి నిర్మిస్తున్నట్టు పలువు రు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని జగజ్జీవన సమైఖ్య సభ్యులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నందిరాజుని వివరణ ఇప్పటికే నోటీసులు జారీ చేశామని చెప్పారు.

ఎమ్మెల్యే పిలుపుతో రంగంలోకి టీడీపీ శ్రేణులు


ఉప్పరగూడెంలో ఆరోగ్యసిబ్బందితో కలిసి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

గోపాలపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డయేరియా బాధిత ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటింటా సర్వేలో టీడీపీ శ్రేణులు పాల్గొని సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం ఉదయం ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలు యుద్ధ ప్రాతి పాదికన డయేరియా ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటా సర్వే, పారిశుధ్య పనుల్లో భాగస్వాములయ్యారు. డ్రైనేజీల వెంబడి బ్లీచింగ్ చల్లటం, చెత్తాచె దారాన్ని జేసీబీల సాయంతోతొలగించటం వంటి పనులు చేశారు.

పెరవలిలో పూడికను తొలగించాలి

పెరవలి, మార్చి17(ఆంధ్రజ్యోతి): పెరవలి నీటిసంఘ పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని పెరవలి ప్రాంత నీటి సంఘం అధ్యక్షులు కోరడంతో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. పెరవలి నీటి సంఘం కమిటీ ఛైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని నీటి వినియోగం, సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. కాలువల్లో అవసరమైన ప్రాంతాల్లో గోడలు నిర్మించడం, తదితర సమస్యలపై చర్చించారు.

కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట నారాయణ, నీటి సంఘం అధ్యక్షులు గుణ్ణం పట్టాభిరామ్, నల్లా భాస్కరరావు, నల్ల సురేంద్ర, శ్రీరామ్మూర్తి, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి బాపినీడు 115వ జయంతి


బాపినీడు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అవంతి ఫీడ్స్ ఉద్యోగులు

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో విద్యాదాత అల్లూరి బాపినీడు 115వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద గల మెయిన్ రోడ్‌పై ఆయన విగ్రహానికి అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పరిమి హరిచరణ్ మాట్లాడుతూ ఏలూరులో సీఆర్ రెడ్డి కళాశాలను స్థాపించి, ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యేగా, జడ్పీఛైర్మన్‌గా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ఎన్నో సేవలందించారన్నారు. అవంతి ఏజీఎం వై. రామచంద్రం మాట్లాడుతూ బాపినీడు ఆశయసాధనలో భాగంగా అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్ కొవ్వూరు పట్టణంలో ఎన్నో సేవలు అందజేస్తున్నారన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో అనపర్తి గోపాలకృష్ణ, అవంతి జీఎం ఎస్. మహంతి, హెచ్ఆర్ మేనేజర్ వి. అమ్మిరాజు, తాతాజీ, ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్, పీజీ డైరెక్టర్ సీహెచ్.వి చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుగుడుమెట్టలో ప్రత్యేక వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, ఎంపీడీవో, తదితర అధికారులు

తాళ్లపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తురుగుడుమెట్టలో డయేరియా కేసులు ఏమీ లేవని, ఆదివారం నమోదైన రెండు కేసుల్లో రోగులు ఆరోగ్యవంతంగా ఉన్నారని వైద్యాధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో 19 సంవత్సరాల వయసు గల యువకుడు అతిసార వ్యాధి బారినపడడంతో గ్రామంలో వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్టు డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. పంచాయ తీ సిబ్బంది సహకారంతో గ్రామంలో శానిటేషన్, తాగునీటి క్లోరినేషన్ చేశామన్నారు. వైద్యసిబ్బంది గ్రామంలో రెండు టీంలుగా ఏర్పడి ఇంటింటికీ తిరిగి సర్వేచేయడం జరిగిందని, గ్రామంలో కొత్తగా ఎటువంటి కేసులు నమోదు కాలేదని ఆమె తెలిపారు. డీఎల్‌పీవో అమ్మాజీ, ఎంపీడీవో వెంకటరమణ, పీహెచ్‌సీ డాక్టర్ సుచందన, కార్యదర్శి సుభద్ర, ఎంపీసీహెచ్ ఈవో ఎతస్ రమేష్, సూపర్‌వైజర్ కృపావరం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గోపాలపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గోపాలపురంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... గోపాలపురం గ్రామానికి చెందిన కొవ్వూరి నాగిరెడ్డి(17) ఇంటి వద్ద నుంచి గోపాలపురం సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా... గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మృతుడు నాగిరెడ్డి రెండుకాళ్లకు తీవ్రగాయాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే నాగిరెడ్డి మృతి చెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. దీనిపై అతని కుమారుడు కొవ్వూరి జశ్వంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పశ్చిమ డెల్టా కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

నిడదవోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గోపవరం - మద్దూరు సమీపంలో సోమవారం రాత్రి ఓ గూడ్స్ ఆటో అదుపు తప్పి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి దూసుకుపోయింది. తాడేపల్లిగూడెం నుంచి కర్బూజ పండ్ల లోడుతో వస్తూ... కాకినాడ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. స్థానికులు తక్షణమే స్పందించి డ్రైవర్‌ను రక్షించారు.

సాయిబాబాకు అభిషేకం


అభిషేకం చేస్తున్న పురోహితుడు

నల్లజర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :అనంతపల్లిలోని షిర్డీ సాయిబాబాకు పురోహితులు సత్యనారాయణ శాస్త్రి, ప్రతాపశర్మ సోమవారం అభిషేకం చేశారు. ఉదయం కాకడ హారతి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాన్యాసం నిర్వహించారు. అనంతరం రెండువేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నేత్ర పరీక్షలు

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గౌతమీనగర్‌లోని సుందరసాయి సేవా కేంద్రంలో సోమవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్టు నిర్వాహకుడు గుడివాక శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గోష్పాదక్షేత్రంలోని సుందరసాయి ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అవసరమైన వారికి నామమాత్ర రుసుముతో కళ్లద్దాలు అందిస్తామన్నారు. త్వరలో ఇఎన్‌టీ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పట్టణంలోని శ్రీరామకాలనీకి చెందిన కిల్లాడ పవన్ ఈనెల 16వ తేదీ రాత్రి 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో చుట్టపక్కలా వెతికినా కనిపించకపోవడంతో యువకుడి తండ్రి కిల్లాడ రాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె. జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఒకవేళ ఆచూకీ తెలిస్తే కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్ 9440796622, 9154875583 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

బాలిక అదృశ్యం ...

గోపాలపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : తొక్కిరెడ్డిగూడెంకి చెందిన నక్కా చాందిని (17) అదృశ్యమైనట్టు తండ్రి కిషోర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కే.సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం _ చాందిని ఆదివారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతి ఆచూకీ తెలిసినవారు గోపాలపురం ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796665కి సమాచారం ఇవ్వాలన్నారు.